సాక్షి
డా. బి ఆర్ అంబేడ్కర్ కోనసీమ

సోమవారం । 17 । ఏప్రిల్ । 2023



రూ.6 లక్షల కర్ర విరాళం

ఆత్రేయపురం: ర్యాలి శ్రీ ఉమా కమండలేశ్వర స్వామి ఆలయంలో ధ్వజస్తంభం పునర్నిర్మాణానికి దేచిరాజు సత్యంబాబు (గుంటూరు) రూ.6 లక్షల విలువైన 52 అడుగుల టేకు కర్రను విరాళంగా సమర్పించారు.




రూ.50 వేల విరాళం

ఆత్రేయపురం: వాడపల్లి వేంకటేశ్వరస్వామి వారికి మల్లా విఠల్ రామవెంకట కేశవరావు, వెంకటలక్ష్మి దంపతులు (దగ్గులూరు) ఆదివారం రూ.50 వేల విరాళం సమర్పించారు.

డెల్టాలకు 4,850 క్యూసెక్కులు



ధవళేశ్వరం: కాటన్ బ్యారేజీ నుంచి గోదావరి డెల్టా కాలువలకు ఆదివారం 4,850 క్యూసెక్కుల నీటిని విడుదల చేశారు. తూర్పు డెల్టాకు 1,400, మధ్య డెల్టాకు 450, పశ్చిమ డెల్టాకు 3 వేల క్యూసెక్కులు వదిలారు. బ్యారేజీ వద్ద నీటిమట్టం 4.50 అడుగులకు చేరింది.



చేపాటు ఆగింది..

- సముద్రంలో వేటకు రెండు నెలల విరామం
- జిల్లాలో ఒడ్డుకు చేరిన 1,700 బోట్లు
- 10 వేల మంది మత్స్యకారులకు ప్రభుత్వ పరిహారం

సాక్షి, అమలాపురం: అలల కెరటాల్లో వేటతో అలసిన వలకు కాస్త విరామం దొరికింది.. మత్స్య క్రమబద్ధీకరణ చట్టంలో భాగంగా శనివారం నుంచి జిల్లాలో సముద్ర వేట నిలిచిపోయింది. చేపలు, ఇతర సముద్ర జీవాల పునరుత్పత్తి జరిగే సమయం కావడంతో కన్యాకుమారి నుంచి కోల్‌కతా వరకూ వేటను నిషేధిస్తూ కేంద్రం ఈ నిర్ణయం తీసుకుంది. దీనివల్ల మత్స్యకార కుటుంబాలకు సా'పాటు' ఇబ్బందికరమే అయినా రాష్ట్ర ప్రభుత్వం పెద్దన్నగా ఆదుకునేందుకు పరిహారం అందిస్తోంది.

జిల్లాలో సుమారు 1,700 బోట్ల ద్వారా పది వేల మంది మత్స్యకారులు సముద్రంలో వేట సాగిస్తూ జీవనోపాధి పొందుతున్నారు. కాకినాడ జిల్లాతో పోల్చితే ఇక్కడ సముద్రంలో వేటాడే మత్స్యకారులు తక్కువే. కోనసీమ జిల్లాలో ఏడు మండలాల్లో 45 తీరప్రాంత గ్రామాలు ఉన్నాయి. సఖినేటిపల్లి మండలం అంతర్వేది పల్లిపాలెం, అల్లవరం మండలం ఓడలరేవు, నక్కా రామేశ్వరం, మామిడికుదురు మండలం కరవాక, ఉప్పలగుప్తం మండలం వాసాలతిప్ప, ఎస్.యానాం, కాట్రేనికోన మండలం చిర్రయానాం, బలుసుతిప్ప, కొత్తపాలెం, మొల్లేటిమొగ, భైరవపాలెం, గాడిమొగ గ్రామాలకు చెందిన మత్స్యకారులు సముద్రంలో వేటకు వెళతారు. అలాగే అనకాపల్లి జిల్లా నక్కపల్లి నుంచి వచ్చే వలస మత్స్యకారులు వేట సాగిస్తుంటారు. వేట నిషేధంతో వీరి బోట్లు తీరంలోనే ఉండిపోయాయి.

61 రోజుల నిషేధం

చేపల పునరుత్పత్తి (గుడ్లు పొదిగి పిల్లలు తయారయ్యే సమయం) జరిగే సమయంలో చేపల వేట సాగిస్తే మత్స్య సంపదకు ముప్పు వాటిల్లుతుంది. చేపల పునరుత్పత్తికి ఇదే అదను. ఇప్పుడు వేట జరిగితే గుడ్లతో ఉన్న శన ఉన్న చేపలు వేటకు బలవుతున్నాయి. చేపల వేట గతంలో అంగుళం, అర అంగుళం వలలతో సాగించేవారు. చిన్న చేపలు తప్పించుకునేవి. కానీ ఇటీవల రింగు వలలు (సూక్ష్మ కన్నాలు ఉండే వల) వాడుతున్నారు. ఈ వలలతో చిన్న చేప తప్పించుకునే అవకాశం ఉండదు. దీనిని నిషేధించినా వాడుతూనే ఉన్నారు. ఇది పర్యావరణానికి సైతం ముప్పు అంటున్నా వినడం లేదు. చేపల పునరుత్పత్తి సమయంలో వేట నిషేధం ద్వారా మత్స్య సంపద పెంపునకు అవకాశం ఉంటుందని నిపుణుల సూచనల ప్రకారం మత్స్య క్రమబద్ధీకరణ చట్టాన్ని రూపొందించారు. ఏటా ఏప్రిల్ 15 నుంచి జూన్ 14 వరకూ 61 రోజుల పాటు వేట నిలిచిపోనుంది. గతంలో 45 రోజులు ఉండేది. ఈ సమయం కూడా సరిపోదని సముద్ర శాస్త్రవేత్తలు చెప్పడంతో ఇది కాస్తా 61 రోజులకు పెరిగింది.



అల్లవరం మండలం ఓడలరేవు తీరంలో నిలిచిపోయిన వేట బోట్లు



తీరంలో వేట బోట్లు

పలు శాఖల నిఘా

నిషేధ సమయంలో వేట జరగకుండా పలు శాఖలు నిఘా పెడుతున్నాయి. కోస్టు గార్డు, మెరైన్, నేవీ, మత్స్య శాఖలతో పాటు స్థానిక పోలీసులు కూడా వేటను అడ్డుకుంటారు. దేశంలో కన్యాకుమారి నుంచి కోల్‌కతా వరకు ఇదే పరిస్థితి. జిల్లాలో సఖినేటిపల్లి మండలం అంతర్వేది పల్లిపాలెం నుంచి ఐ.పోలవరం మండలం భైరవపాలెం వరకూ మత్స్యకారులు సముద్ర వేటకు దూరంగా ఉండనున్నారు. ఈ సమయంలో ఎవరైనా చేపల వేట సాగిస్తే రూ.2,500 వరకూ జరిమానా విధించడంతో పాటు బోట్లను సీజ్ చేస్తారు. సంప్రదాయ పద్ధతిలో ఇంజన్లు లేకుండా వేట సాగించే మత్స్యకారులకు మాత్రం ఈ నిషేధం వర్తించదని మత్స్యశాఖాధికారులు చెబుతున్నారు.

ప్రభుత్వ పరి'హా'రం

రెండు నెలల పాటు వేటకు దూరంగా ఉండే మత్స్యకారులను రాష్ట్రంలో వైఎస్సార్ సీపీ ప్రభుత్వం ఆదుకుంటుంది. గత టీడీపీ ప్రభుత్వ హయాంలో వేట లేని సమయంలో రూ.నాలుగు వేలు ఇచ్చేవారు. అది కూడా 20 శాతం మందికి వేట నిషేధం తరువాత నాలుగైదు నెలలకు అందేది. వైఎస్సార్ సీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత వేటకు దూరమైన మత్స్యకారునికి వైఎస్సార్ మత్స్యకార భరోసా పథకంలో రూ.పది వేల ఆర్థిక సహాయం అందుతోంది. అది కూడా అర్హత ఉన్న ప్రతి ఒక్కరికీ. ఈ పరిహారాన్ని వేట నిషేధ సమయంలోనే అందిస్తున్నారు.

నేడు మత్స్యకారుల గుర్తింపు



వేటకు దూరమైన మత్స్యకారులను గుర్తించేందుకు జిల్లాలో సోమవారం ఎన్యూమరేషన్ నిర్వహించనున్నారు. 18 మీటర్ల పొడవున్న మెకనైజ్డ్ బోటుకు యజమానితో పాటు మరో ఎనిమిది మందికి వైఎస్సార్ మత్స్యకార భరోసా వర్తిస్తోంది. మోటరైజ్డ్ బోట్‌కు యజమానితో కలిపి ఆరుగురికి, సంప్రదాయ బోటుకు ముగ్గురు చొప్పున పరిహారం ఇస్తారు. లబ్ధిదారులు బోటు రిజిస్ట్రేషన్ డాక్యుమెంట్, ఫిషింగ్ లైసెన్స్, ఆధార్ కార్డు, రేషన్ కార్డు, బ్యాంకు అకౌంట్‌ల వివరాలను అందించాలి. ఎన్యూమరేషన్‌ను ఎంపిక చేసిన బోటు ల్యాండింగ్ సెంటర్ల వద్ద నిర్వహించనున్నారు. జిల్లాలో ఏడు ల్యాండింగ్ సెంటర్లు ఉన్నాయి.

–షేక్ లాల్ మహమద్, జేడీ, ఫిషరీస్

నేడు యథావిధిగా 'స్పందన'

అమలాపురం రూరల్: ప్రజా సమస్యల పరిష్కార వేదిక స్పందన కార్యక్రమాలను సోమవారం యథావిధిగా నిర్వహిస్తామని జిల్లా కలెక్టర్ హిమాన్షు శుక్లా ఆదివారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. జిల్లా కలెక్టరేట్ స్పందన హాలులో జిల్లా స్థాయి, ఆర్డీవో కార్యాలయంలో డివిజన్ స్థాయి, మండల కార్యాలయాల్లో గ్రామ, వార్డు సచివాలయాల్లోనూ అర్జీదారుల నుంచి ఫిర్యాదులు స్వీకరిస్తారని ఆయన తెలిపారు. అధికారులంతా ఉదయం 10 గంటల నుంచే ఫిర్యాదులను స్వీకరిస్తారని, గ్రామ, వార్డు సచివాలయాల్లో మాత్రం మధ్యాహ్నం మూడు గంటల నుంచి సాయంత్రం ఐదు గంటల మధ్య విజ్ఞాపనల స్వీకరిస్తారని కలెక్టర్ వివరించారు. ఈ కార్యక్రమాలను అర్జీదారులు సద్వినియోగం చేసుకోవాలని విజ్ఞప్తి చేశారు.

కిక్కిరిసిన అయినవిల్లి



అయినవిల్లి విఘ్నేశ్వర స్వామివారి ఆలయంలో లక్ష్మీగణపతి హోమం చేస్తున్న పండితులు

అయినవిల్లి: అయినవిల్లి విఘ్నేశ్వరుని ఆలయం ఆదివారం భక్తులతో కిక్కిరిసింది. స్వామివారికి ఆలయ అర్చకుడు సత్తిబాబు ఆధ్వర్యంలో విశేష పూజలు జరిగాయి. స్వామివారి లఘున్యాస అభిషేకాలు, లక్ష్మీగణపతి హోమంలో అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు. పలువురు నూతన వాహనాలకు పూజలు చేయించుకున్నారు. స్వామివారి ప్రత్యేక దర్శనం టిక్కెట్‌ల ద్వారా రూ.15,550, అన్న ప్రసాదాలకు విరాళాలుగా రూ.63,089, వివిధ సేవలకు రూ.30,590, ప్రసాదాల విక్రయం ద్వారా రూ.30,935, వివిధ విరాళాలుగా రూ.10,350 ఆదాయం సమకూరిందని ఆలయ ఈఓ ముదునూరి సత్యనారాయణరాజు తెలిపారు.

న్యూస్‌రీల్

భవనం పైనుంచి పడి కార్మికుడి మృతి



మురళీకృష్ణ (ఫైల్)

తాళ్లరేవు: కొత్త కోరంగి గ్రామంలో భవనంపై నుంచి పడి ఓ కార్మికుడు మృతి చెందినట్లు కోరంగి ఎస్సై పి.శ్రీనివాసకుమార్ తెలిపారు. ఆదివారం ఆయన తెలిపిన వివరాల మేరకు.. సుంకరపాలెం పంచాయతీ అంబేడ్కర్ నగర్‌కు చెందిన పలివెల మురళీకృష్ణ (33) కొత్త కోరంగిలోని ఎస్సీ వసతి గృహానికి శనివారం రంగులు వేసేందుకు వెళ్లాడు. నాలుగు అంతస్తుల భవనానికి రంగులు వేస్తుండగా తాడు తెగిపోయి అదుపుతప్పి పడిపోయాడు. ఈ ప్రమాదంలో మురళీకృష్ణకు తీవ్ర గాయాలయ్యాయి. అతన్ని స్థానికులు వెంటనే కాకినాడ ప్రభుత్వాస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ మృతి చెందినట్లు ఎస్సై తెలిపారు. మృతుడికి భార్య, ఒక కుమార్తె ఉన్నారు.

జేఎన్‌టీయూకేలో నేడు స్టడీ అబ్రాడ్ ఫెయిర్

బాలాజీచెరువు (కాకినాడ సిటీ): జేఎన్‌టీయూకేలో సోమవారం స్టడీ అబ్రాడ్ ఫెయిర్–23 నిర్వహిస్తున్నారు. విదేశాల్లో ఎంఎస్ లేదా ఎంబీఏ కోర్సులు చదవాలనుకునే వారికి సలహాలు, సూచనలు ఇచ్చేందుకు, ఫీజు తదితర వివరాలు తెలియజేసేందుకు ఈ ఫెయిర్ చేపట్టారు. రాష్ట్ర ఉన్నత విద్యామండలి, ఆప్ స్కిల్ ఆధ్వర్యాన సంయుక్తంగా నిర్వహిస్తున్న ఈ కార్యక్రమానికి ప్రభుత్వ కళాశాలలతో పాటు వర్సిటీకి అనుబంధంగా 8 జిల్లాల్లో ఉన్న ప్రైవేటు ఇంజినీరింగ్, మేనేజ్‌మెంట్ విద్యార్థులు దాదాపు 2 వేల మంది రిజిస్ట్రేషన్ చేసుకున్నారు. బీటెక్ లేదా ఎంటెక్ పూర్తి చేసిన, బీటెక్ తృతీయ, ఆఖరి సంవత్సరం, ఎంబీఏ, ఎంసీఏ, ఎంటెక్ ఫైనలియర్‌కు చెందిన వారు, విదేశీ చదువులపై ఆసక్తి ఉన్న వారు ఈ ఫెయిర్‌లో పాల్గొనవచ్చు. యూనివర్సిటీ ఆఫ్ నార్త్ ఆల్‌బర్మా (యూఎస్‌ఏ), మార్క్యూట్ యూనివర్సిటీ మిల్‌వాక్యూ, యూనివర్సిటీ ఆఫ్ మిస్సోరియం స్టేట్ లూయిస్, యూనివర్సిటీ ఆఫ్ ఆరిజోనా, వెబ్‌స్టార్ యూనివర్సిటీ కేప్ గిరాడ్యు, యూనివర్సిటీ ఆఫ్ ఆబేర్‌డీన్, యూనివర్సిటీ ఆఫ్ డేర్‌బై, ప్యారిస్‌కు చెందిన ది అమెరికన్ బిజినెస్ స్కూల్ ప్యారిస్, ఐసీడీ బిజినెస్ స్కూల్, స్కూల్ ఆఫ్ స్ట్రాటజీ మేనేజ్‌మెంట్, ఇన్ఫర్మేటిక్యూ ఈటీ న్యూమర్క్యూ, కాలేజ్ డీఈ ప్యారిస్, జర్మనీకి చెందిన బెర్లిన్ బిజినెస్ స్కూల్, స్విట్జర్లాండ్‌కు చెందిన రూష్‌ఫర్ బిజినెస్ స్కూల్, ట్రాన్స్‌పోర్ట్ అండ్ టెలికం ఇనిస్టిట్యూట్ లాటియాతో పాటు ఇతర యూనివర్సిటీలు ఈ ఫెయిర్‌లో పాల్గొంటున్నాయి.

'డొక్కా సీతమ్మ' పురస్కారాల ప్రదానం



లక్ష్మీనరసింహను సత్కరిస్తున్న న్యాయమూర్తి నరేష్, విశ్రాంత ఐపీఎస్ అధికారి లక్ష్మీనారాయణ

అమలాపురం టౌన్: ఆంధ్రుల అన్నపూర్ణ డొక్కా సీతమ్మ స్ఫూర్తితో ఐదేళ్ల కిందట స్థాపించిన కోనసీమ ఆహార నిధి సంస్థ అన్నార్తుల ఆకలి తీర్చడంలో ముందుందని జిల్లా రెండో అదనపు కోర్టు న్యాయమూర్తి వి.నరేష్, విశ్రాంత ఐపీఎస్ అధికారి వీవీ లక్ష్మీనారాయణ అన్నారు. స్థానిక విద్యానిధి విద్యా సంస్థల భవనంలో ఆదివారం జరిగిన కోనసీమ ఆహార నిధి సంస్థ ఐదో వార్షికోత్సవ సభకు వారు ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ఈ సంస్థ ద్వారా ముగ్గురికి డొక్కా సీతమ్మ పురస్కారాలు–2023 ప్రదానం చేశారు. బాపట్ల జిల్లా యాజిలికి చెందిన ప్రధానమంత్రి అవార్డు గ్రహీత యాజిలి ఫార్మర్స్ ప్రొడ్యూసర్ కంపెనీ లిమిటెడ్ చైర్మన్ ఇక్కుర్తి లక్ష్మీనరసింహ, గుంటూరు జిల్లా అత్తోట గ్రామ యువ ఆదర్శ రైతు అవార్డు గ్రహీత యర్రు బాపారావు, కృష్ణా జిల్లా కంకిపాడు వాసి ఫోపుల్ డ్రోన్ టెక్ ప్రైవేట్ లిమిటెడ్ సీఈఓ అంబుల గోపీరాజులకు నరేష్, లక్ష్మీనారాయణలు పురస్కారాలు ప్రదానం చేశారు. అనంతరం రక్తదాన శిబిరాన్ని ప్రారంభించారు. మున్సిపల్ కమిషనర్ ఒమ్మి అయ్యప్ప నాయుడు, పంచాయతీరాజ్ డీఈఈ అన్యం రాంబాబు, అంతర్జాతీయ శిల్పి ఆచార్య రాజ్‌కుమార్ వుడయార్, విద్యానిధి విద్యా సంస్థల చైర్మన్ ఏబీ నాయుడు, చాంబర్ ఆఫ్ కామర్స్ అధ్యక్షుడు కల్వకొలను తాతాజీ, డాక్టర్ గంధం విశ్వనాథ్, డాక్టర్ శ్రీహరి రాయులు ప్రసంగిస్తూ ఆహార నిధి సంస్థ అధ్యక్షుడు సతీష్ సేవలను కొనియాడారు.

అందరి భవిష్యత్తు జగనన్నే...



అయినవిల్లి మండలం కె.జగన్నాథపురంలో 'జగనన్నే మా భవిష్యత్తు' కార్యక్రమం నిర్వహించారు. ఇందులో రాజ్యసభ సభ్యుడు పిల్లి సుభాష్‌చంద్రబోస్, అమలాపురం ఎంపీ చింతా అనురాధ, పి.గన్నవరం ఎమ్మెల్యే కొండేటి చిట్టిబాబు తదితరులు పాల్గొన్నారు.

గోటితలంబ్రాలకు శ్రీకారం

- సత్యదేవుని సన్నిధిలో ధాన్యం ఒలిచిన భక్తులు
- వారం రోజుల పాటు కార్యక్రమం

అన్నవరం: చాన్నాళ్లుగా భద్రాద్రి శ్రీసీతారామచంద్ర స్వామివారికి.. ఒంటిమిట్ట శ్రీ కోదండరాముడి కల్యాణోత్సవాల్లో మాత్రమే గోటి తలంబ్రాలు వినియోగిస్తున్న విషయం అందరికీ తెలిసిందే. ఇక నుంచి భక్త వరదుడు అన్నవరం సత్యదేవుని పరిణయ వేడుకలో కూడా ఈ గోటి తలంబ్రాలు వినియోగించనున్నారు. కల్యాణోత్సవ వేళ స్వామి, అమ్మవార్లు ఒకరి శిరస్సులపై ఒకరు గోటి తలంబ్రాలు పోయనున్నారు. మే 1న జరిగే సత్యదేవుని దివ్యకల్యాణ మహోత్సవాన్ని పురస్కరించుకుని గోటి తలంబ్రాలు వినియోగించాలని అన్నవరం దేవస్థానం ఈఓ చంద్రశేఖర్ అజాద్ ఆదేశించిన విషయం తెలిసిందే. ఈ మేరకు గోటితో తలంబ్రాలు తయారు చేసే కార్యక్రమానికి ఆదివారం శ్రీకారం చుట్టారు. ఉదయం 9 గంటలకు రత్నగిరి రామాలయం నుంచి తలంబ్రాల ధాన్యాన్ని మహిళలు విశ్రాంతి మండపంలో కొలువు దీరిన సత్యదేవుడు, అనంతలక్ష్మీ సత్యవతీదేవి అమ్మవార్ల వద్దకు ఊరేగింపుగా తీసుకువచ్చారు. ఆ ధాన్యానికి వేద పండితులు ప్రత్యేక పూజలు చేశారు. గోటితో తలంబ్రాలు ఒలిచే కార్యక్రమాన్ని ఈఓ అజాద్ ప్రారంభించారు. రోజుకు 30 కేజీల చొప్పున వారం రోజుల పాటు ధాన్యం ఒలుస్తారని అధికారులు తెలిపారు. స్థానిక వాసవీ మహిళా సంఘం సభ్యులు, భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని గోటితో తలంబ్రాలు ఒలిచారు.



గోటి తలంబ్రాలు ఒలుస్తున్న మహిళలు

విద్యుద్దీపాలంకరణ పనులు ప్రారంభం

సత్యదేవుని కల్యాణ మహోత్సవాలకు విద్యుద్దీపాలంకరణ పనులు ప్రారంభమయ్యాయి. ఈసారి విద్యుద్దీపాలంకరణ కాంట్రాక్ట్‌ను శ్రీకాళహస్తికి చెందిన కాంట్రాక్టర్ రూ.22.5 లక్షలకు దక్కించుకున్నారు. సత్యదేవుని ఉత్సవాల్లో ఊరేగించే వెండి గజ, గరుడ, అంజనేయ, రథ వాహనాలను గోడౌన్ నుంచి ఈఓ కార్యాలయం వద్దకు మార్చనున్నారు. ఇందుకోసం ఈఓ కార్యాలయం వద్ద షెడ్డు నిర్మిస్తున్నారు. ఈ షెడ్డుకు అద్దాలు బిగించనున్నారు.

నేడో రేపో సమన్వయ సమావేశం?

సత్యదేవుని కల్యాణ మహోత్సవాలపై ప్రజాప్రతినిధులు, ప్రభుత్వ శాఖల అధికారులతో సమన్వయ సమావేశం నిర్వహించనున్నారు. సోమవారం ఉదయం 10.30 గంటలకు ఈ సమావేశం నిర్వహణకు ఏర్పాట్లు చేశారు. ముందుగా నిర్ణయించిన కార్యక్రమాలతో ఈ సమావేశానికి రాలేమని మంత్రి దాడిశెట్టి రాజా, ఎమ్మెల్యే పర్వత శ్రీపూర్ణచంద్ర ప్రసాద్ తెలిపినట్టు సమాచారం. సోమవారం స్పందన ఉండటంతో ప్రభుత్వాధికారులూహాజరు కావడం లేదు. దీంతో ఈ సమావేశం వాయిదా పడే అవకాశం ఉందని సమాచారం. గతంలో సమన్వయ సమావేశాలకు మంత్రులు, ఎమ్మెల్యే, ఎంపీ, కలెక్టర్‌లను ఈఓ స్వయంగా ఆహ్వానించేవారు. ఈసారి ఏఈఓ, సూపరింటెండెంట్ స్థాయి అధికారులు ఆహ్వానించడంపై అసంతృప్తి వ్యక్తం చేస్తున్నట్టు సమాచారం.

వినమంట ఈ జాగ్రత్తలు

- వేసవిలో అగ్ని ప్రమాదాలకు ఆస్కారం
- జిల్లాలో ఏడాదిగా 331 సంఘటనలు
- అవగాహన, అప్రమత్తతతో నివారణ

రాయవరం: నింగిన సూరీడు నెత్తిన సుర్రుమనిపిస్తున్నాడు.. వసంత కాలంలోనే భగ్గుభగ్గు అంటూ నిప్పులు కురిపిస్తున్నాడు.. మార్చిలోనే మే నెలను తలదన్నేటట్టు సెగలు పుట్టిస్తున్నాడు. ఈ ఏడాది వేసవి ఉష్ణోగ్రతలు 45 డిగ్రీల సెల్సియస్ దాటుతాయని ముందుగానే వాతావరణ శాఖ హెచ్చరించింది. ఇప్పుడు మండే ఎండలకు తోడు మరోపక్క అగ్ని ప్రమాదాలు వెంటాడుతున్నాయి. వీటివల్ల ఆస్తితో పాటు ప్రాణనష్టం కూడా జరుగుతుంది. ప్రతి ఏటా మార్చి నుంచి జూన్ వరకూ నాలుగు నెలల పాటు ప్రజలు అప్రమత్తంగా ఉండాలని అగ్నిమాపక శాఖ సూచిస్తోంది. వేసవిలో అగ్ని ప్రమాదాలపై ప్రజలకు చైతన్యం నింపేందుకు ఏటా ఏప్రిల్ 14 నుంచి 20వ తేదీ వరకూ అగ్నిమాపక వారోత్సవాలు నిర్వహిస్తుంది. 1994 ఏప్రిల్ 14న ముంబయి రేవులో జరిగిన అగ్ని ప్రమాద ఘటనకు గుర్తుగా ఏటా జాతీయ అగ్నిమాపక దినోత్సవం జరుపుకొంటున్నారు. ప్రస్తుతం జిల్లాలోని ఆరు అగ్నిమాపక కేంద్రాల పరిధిలో ఈ వారోత్సవాలు నిర్వహిస్తున్నారు. జిల్లాలో పి.గన్నవరం మినహా మిగిలిన ఆరు నియోజకవర్గాల్లో అగ్నిమాపక కేంద్రాలు ఉన్నాయి. పి.గన్నవరంలో కూడా అగ్నిమాపక కేంద్రం ఏర్పాటుకు ప్రభుత్వం ఆమోద ముద్ర వేసింది. మొత్తంగా చూస్తే జిల్లాలోని ఏడు నియోజకవర్గాల్లో అగ్నిమాపక కేంద్రాలు 20 కిలోమీటర్ల లోపే ఉన్నాయి. అయితే పెద్ద ప్రమాదాలు సంభవించినప్పుడు నష్టం నిమిషాల్లోనే జరిగిపోతుంది. ఈ నేపథ్యంలో ప్రమాదాలపై ప్రజలకు అవగాహన కల్పించేందుకు ప్రభుత్వం అగ్నిమాపక వారోత్సవాలు నిర్వహిస్తోంది. ఇందులో భాగంగా వివిధ ప్రాంతాల్లో అగ్నిమాపక పరికరాల ప్రదర్శన, అవగాహన కల్పించడం, నివాస ప్రాంతాల్లో ముఖ్యంగా అపార్ట్‌మెంట్‌ల వద్ద వంట గ్యాస్ వినియోగంలో భద్రత పాటించడం, నిర్లక్ష్యంగా పొగ తాగడం, అగ్నిమాపక నియంత్రణ పరికరాల వినియోగం తదితర అంశాలపై అవగాహన కల్పిస్తున్నారు. దీనిపై 17వ తేదీ సోమవారం వివిధ విద్యాసంస్థల్లో మాక్‌డ్రిల్ నిర్వహిస్తారు. 18న ఎల్‌పీజీ (వంట గ్యాస్) స్టోరేజీ, పరిశ్రమల్లో అగ్ని ప్రమాదాల నివారణపై అవగాహన కార్యక్రమాలు ఏర్పాటు చేయనున్నారు. 19న ఆసుపత్రుల్లో వైద్యులు, స్టాఫ్ నర్సులు, రోగులకు అవగాహన ఉంటుంది. 20న అగ్ని ప్రమాదాల నివారణపై అంగన్‌వాడీ కేంద్రాలు, స్వచ్ఛంద సంస్థల్లో అవగాహన కార్యక్రమాలు ఏర్పాటు చేసి, వారోత్సవాల ముగింపు ఉత్సవం నిర్వహిస్తారు.



అగ్నిమాపక శకటం

ఇలా చేస్తే మంచిది..

- ఇంట్లో గ్యాస్ స్టౌను సిలిండర్ కన్నా ఎత్తులో ఉంచాలి. వాడుతున్న సిలిండర్‌కు అదనపు సిలిండర్ దూరంగా ఉండాలి. వీటికి దగ్గరంలో కిరోసిన్, డీజిల్, పెట్రోల్‌ను ఉంచరాదు.
- వంట పూర్తయిన వెంటనే సిలిండర్ రెగ్యులేటర్ ఆపేయాలి. ఐఎస్ఐ మార్కు ఉన్న ఎల్‌పీజీ సురక్ష ట్యూబ్‌లనే వాడాలి.
- గ్యాస్ లీకవుతున్నట్లు అనుమానం వస్తే కిటికీలు, తలుపులు వెంటనే తెరవాలి. ఎలక్ట్రిక్ స్విచ్‌లు ఆన్, ఆఫ్ చేయరాదు.
- చిన్నారులకు అగ్గి పెట్టెలు, లైటర్లు అందుబాటులో ఉంచరాదు.
- ఒక ఎలక్ట్రిక్ పాయింట్‌లో ఎక్కువ ప్లగ్గులు పెట్టరాదు.
- ఇళ్లు వదిలి, దూర ప్రాంతాలకు వెళ్లేటప్పుడు విద్యుత్ మెయిన్ స్విచ్ ఆఫ్ చేయాలి.
- విద్యుత్ పరికరాలకు నిప్పంటుకుంటే మెయిన్ ఆఫ్ చేసి పొడి ఇసుక లేదా డ్రై కెమికల్ పౌడర్‌ను నిప్పుపై చల్లాలి.
- కాల్చిన సిగరెట్లు, బీడీలు, అగ్గిపుల్లలు ఆర్పిన తరువాతే పాడేయాలి.
- దుస్తులకు నిప్పంటుకుంటే పరుగెత్తరాదు. నేలపై దొర్లాలి లేదా దుప్పటి చుట్టుకోవాలి. కాలిన శరీర భాగాలపై చల్లని నీరు పోయాలి.
- ప్రమాదం జరిగి పొగతో నిండిన గదుల్లో మోచేతులు, మోకాళ్లపై పాకాలి.
- గడ్డి వాములను నివాసాలకు 60 అడుగుల దూరంలో, గాలివాటంగా, రైట్ యాంగిల్స్‌లో వేసుకోవాలి.
- గుడిసెకు గుడిసెకు మధ్య 30 అడుగుల దూరాన్ని పాటించాలి.
- కర్మాగారాల్లో పరిసరాల శుభ్రత పాటించాలి. కార్మికులు పనిచేసే స్థలాల్లో కనీసం రెండు ఫైర్ ఎగ్జిట్స్ ఏర్పాటు చేయాలి.

జిల్లాలో అగ్నిమాపక కేంద్రాల ఫోన్ నంబర్లు

ప్రాంతం	సెల్ నంబర్	ల్యాండ్ నంబర్
అమలాపురం	99637 27665	08856–231101
ముమ్మిడివరం	99637 28285	08856–271101
రాజోలు	99637 27827	08862–221101
కొత్తపేట	99637 28051	08855–243299
రామచంద్రపురం	99637 27545	08857–242401
మండపేట	99637 27741	08855–232101



రాయవరం మండలం సోమేశ్వరంలో అగ్నికి ఆహుతవుతున్న ఇళ్లు (ఫైల్)

ప్రమాదాలు.. నష్టాలు

ప్రధానంగా వేసవిలో అగ్ని ప్రమాదాలు ఎక్కువగా జరుగుతూంటాయి. ప్రత్యేకించి ఒక్కో రోజు ఒక్కో ప్రాంతంలో రెండు మూడు ప్రమాదాలు చోటుచేసుకోవడం చూస్తుంటాం. గత ఏడాది ఏప్రిల్ నుంచి ఈ ఏడాది మార్చి నెలాఖరు వరకూ జిల్లా వ్యాప్తంగా 331 అగ్ని ప్రమాదాలు జరిగాయని అధికారుల లెక్కలు స్పష్టం చేస్తున్నారు. ఇందులో రూ.10 లక్షలకు పైగా నష్టం జరిగినవి నాలుగు, మధ్యస్తంగా అంటే రూ.2 లక్షల నుంచి రూ.10 లక్షల లోపు 31 ప్రమాదాలు, చిన్నవి 275 ప్రమాదాలు సంభవించాయి. ఆయా ఘటనల్లో నలుగురు ప్రాణాలు కోల్పోగా, 12 మందిని అగ్నిమాపక సిబ్బంది కాపాడారు. ఇందులో మూడు పశువులు చనిపోగా, ఆరు పశువులను సిబ్బంది రక్షించారు. మొత్తం ప్రమాదాల్లో రూ.4 కోట్ల వరకూ ఆస్తినష్టం సంభవించింది. రూ.9.73 కోట్ల ఆస్తిని అగ్నిమాపక సిబ్బంది కాపాడారు.

ప్రజల్లో చైతన్యం తీసుకొస్తున్నాం..



అగ్ని ప్రమాదాలను అదుపు చేయడంతో పాటు వీటిపై ముందుగా ప్రజల్లో చైతన్యం నింపుతున్నాం. అవసరమైన వారికి శిక్షణ ఇస్తున్నాం. వేసవిలో నిర్లక్ష్యంగా పొగ తాగడం అత్యంత ప్రమాదకరం. ఇంట్లో వంట చేసే సమయంలో తగిన జాగ్రత్తలు పాటించాలి. ముందస్తు అప్రమత్తతతోనే ప్రమాదాలను అరికట్టవచ్చు.

–చిన్నం మార్టిన్ లూథర్‌కింగ్, జిల్లా ఇన్‌చార్జి విపత్తుల స్పందన అధికారి, అమలాపురం

క్లుప్తంగా

బాలుడి శస్త్రచికిత్స విజయవంతం



బాలుడి ఆరోగ్యం గురించి తెలుసుకుంటున్న వైఎస్సార్ సీపీ నేత సుంకర వీరబాబు

గోకవరం: పుట్టుకతోనే చెవిటి, మూగతో బాధపడుతున్న గోకవరానికి చెందిన వెలిశెట్టి చక్రపాణి(8)కి శస్త్రచికిత్స విజయవంతమైందని వైఎస్సార్ సీపీ నాయకుడు సుంకర వీరబాబు తెలిపారు. ఆదివారం శస్త్రచికిత్స చేయించుకుని ఇంటికి వచ్చిన బాలుడిని ఆయన పరామర్శించారు. అతని ఆరోగ్య పరిస్థితిపై బాలుడి తండ్రి శివను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పుట్టుకతోనే చెవిటి, మూగతో బాధపడుతున్న బాలుడికి గుంటూరులోని ఓ ప్రైవేట్ ఆస్పత్రిలో చికిత్స చేయించడానికి జగ్గంపేట ఎమ్మెల్యే జ్యోతుల చంటిబాబు కృషితో సీఎం రిలీఫ్ ఫండ్ నుంచి రూ. 5.35 లక్షలు మంజూరయ్యాయన్నారు. రెండు నెలల కిందట బాలుడిని ఆస్పత్రిలో చేర్పించారన్నారు. శస్త్రచికిత్స విజయవంతం కావడంతో బాలుడు మాటలను విని ప్రతి స్పందిస్తున్నాడని చెప్పారు. బాలుడి వైద్యానికి సహకరించిన సీఎం జగన్‌మోహన్‌రెడ్డికి, ఎమ్మెల్యే జ్యోతుల చంటిబాబుకు కృతజ్ఞతలు తెలిపారు.

వివాహిత ఆత్మహత్య

గోపాలపురం: చిట్యాల గ్రామంలో ఓ వివాహిత ఆత్మహత్య చేసుకున్నట్టు ఎస్సై కె.రామకృష్ణ తెలిపారు. ఆయన కథనం ప్రకారం.. చిట్యాల గ్రామానికి చెందిన మెరిపే భాగ్యకుమారి (28) కొంత కాలంగా వెన్నునొప్పితో బాధపడుతోంది. భర్త గణేష్‌కు ఆర్థిక ఇబ్బందులతో ఆసుపత్రికి వెళ్లలేకపోవడంతో మనస్తాపానికి గురైన భాగ్య కుమారి తన ఇంట్లోని ఫ్యాన్‌కు చీరతో ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకుంది. మృతురాలి తల్లి గోనె మరియదాసు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశామని ఎస్సై వివరించారు.

నిలకడగా పొగాకు మార్కెట్

దేవరపల్లి: పొగాకు మార్కెట్ నిలకడగా కొనసాగుతోంది. పూర్వపు పశ్చిమ గోదావరి జిల్లాలోని ఐదు వేలం కేంద్రాల్లో గత నెల 23న పొగాకు కొనుగోళ్లు ప్రారంభించారు. ఇప్పటి వరకూ 17 రోజుల పాటు వేలం జరిగింది. రూ.113 కోట్ల విలువైన 5.23 మిలియన్ కిలోల పొగాకు విక్రయాలు జరిగినట్టు బోర్డు రీజినల్ మేనేజర్ జీవీకే ప్రసాద్ తెలిపారు. మార్కెట్లో ధర నిలకడగా ఉంది. కిలో గరిష్ట ధర రూ.210 పలుకుతున్నప్పటికీ కొన్ని బేళ్లకు మాత్రమే లభిస్తోందని, ఎక్కువ బేళ్లకు రూ.195 ధర వస్తోందని రైతులు తెలిపారు. ఐదు వేలం కేంద్రాలకు కిలో సగటు ధర రూ.195.82 లభిస్తోంది. గరిష్ట ధర కంటే సగటు ధర ఎక్కువ ఉందని అధికారులు చెబుతున్నారు.

కోకో.. లాభాలు అందుకో..

- గింజలకు రికార్డు స్థాయి ధర
- కిలో రూ.225కు విక్రయాలు
- లాభాల బాట పట్టిన రైతులు



తీపర్రులో కోకో తోట



ఆరబెట్టిన కోకో గింజలు

పెరవలి: కోకో.. ఈ పంట రైతులకు సిరులు కురిపిస్తోంది.. లాభాల బాట పట్టిస్తోంది.. ఎన్నడూ లేని విధంగా ఈ ఏడాది రికార్డు స్థాయిలో ధర నమోదైంది. పుడమి పుత్రుల మోములో ఆనందం వెల్లివిరిస్తోంది. కోకో గింజలకు గతంలో ఎన్నడూ లేని విధంగా మార్కెట్‌లో గిట్టుబాటు ధర లభిస్తోంది. తూర్పుగోదావరి జిల్లాలో 14 వేల హెక్టార్లలో కోకో పంటను సాగు చేస్తున్నారు. అనపర్తి, పెరవలి, ఉండ్రాజవరం, నిడదవోలు, చాగల్లు, దేవరపల్లి, నల్లజర్ల మండలాల్లో ఈ సాగు జరుగుతోంది. ఏటా సుమారు 2 లక్షల క్వింటాళ్ల కోకో గింజల ఉత్పత్తి అవుతోంది. ఎకరానికి సాధారణంగా 5 క్వింటాళ్ల దిగుబడి రావాల్సి ఉండగా ఈ ఏడాది 5 నుంచి 6 క్వింటాళ్లు వస్తుండడంతో రైతులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. మార్కెట్‌లో మంచి ధర లభించటంతో లాభాలు చేకూరుతాయని.. ఇంత ధర కోకో పంట వేసినప్పటి నుంచి చూడలేదని రైతులు అంటున్నారు. 2021లో కిలో గింజలకు రూ.160 నుంచి రూ.190లు, 2022లో రూ.210 వరకూ ధర పలికింది. ఈ ఏడాది మొదట్లోనే రూ.225 ధర వస్తోంది. ఇంత ధర రావడానికి ప్రభుత్వ సహకారమే కారణమని రైతులు వివరిస్తున్నారు. సాగుకు రాయితీలు, పంట విక్రయాలకు ప్రభుత్వం తోడ్పాటు అందించడంతో లాభాల బాట పడుతున్నామని చెబుతున్నారు. కోకోను చాక్లెట్ తయారీలో ఎక్కువగా వినియోగిస్తుంటారు. చాక్లెట్‌ల విక్రయాలూ పెరుగుతుండడంతో కోకోకు అమాంతం డిమాండ్ ఏర్పడుతోంది. ధరలు ఇలా ఉంటే పంట విస్తీర్ణం మరింత పెరుగుతుందని అధికారులు అంటున్నారు.

రాయితీలు.. సహకారం

జిల్లాలో కోకో సాగు 14 వేల హెక్టార్లలో ఉంటే.. నిడదవోలు నియోజకవర్గంలో 460 ఎకరాల్లో సాగు చేస్తున్నారు. దీనిపై ప్రత్యక్షంగా, పరోక్షంగా 4 వేల మంది ఆధారపడి జీవిస్తున్నారు. కోకో సాగుకు రూ.వేల పెట్టుబడి పెట్టాల్సి ఉంటుందని, అధిక స్థాయిలో ఎరువులు వినియోగించాలని, తెగుళ్లు అదే స్థాయిలో వస్తాయని రైతులు అంటున్నారు. ప్రభుత్వం అండతో ఈ ఏడాది లాభాల బాట పట్టామని చెబుతున్నారు. కోకో మొక్కలు వేసినప్పటి నుంచి ఎరువులకూ ప్రభుత్వం రాయితీ అందిస్తుంది. హెక్టారుకు మొదటి ఏడాది రూ.14 వేలు, రెండో ఏడాది రూ.4 వేలు, మూడో ఏడాది రూ.4 వేల చొప్పున రాయితీలు ఇస్తుంది. దీనివల్ల కోకో సాగు విస్తీర్ణం ప్రతి ఏడాది పెరుగుతూ వస్తోంది.

ఊహించని ధర



గత ఏడాది కంటే అధిక ధర వస్తుందని ఆశించాం. కానీ ఇంత ఎక్కువ ధర లభిస్తుందని ఊహించలేదు. ధరలు ఇలాగే ఉంటే లాభాలు భారీగా వచ్చే అవకాశం ఉంది. పంటను చిన్న పిల్లల్లా సంరక్షించుకుని సాగు చేస్తున్నాం.

–కంటిపూడి సూర్యనారాయణ, రైతు, తీపర్రు

చరిత్రలో ఎప్పుడూ లేదు



ప్రతి ఏడాది లాగే ఈ ఏడాది కోకో పంట దిగుబడి మార్చి నుంచి ప్రారంభమైంది. ధర మార్చి నెలలోనే రూ.225 పలకడం కోకో చరిత్రలో ఎప్పుడూ లేదు. ఇప్పటి వరకూ నిలకడగా ధర ఉంది. ఇది మరింత పెరిగే అవకాశం ఉంటుందని అనుకుంటున్నారు.

–కరుటూరి శ్రీనివాసరావు, రైతు, తీపర్రు

తల్లి చెంతకు చేరిన బిడ్డ

అంబాజీపేట: డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లాలో మగబిడ్డ మాయమైన సంఘటన సంచలనం సృష్టించింది. చివరికి అధికారుల సమక్షంలో ఆ శిశువు తల్లి ఒడికి చేరింది. ఆదివారం అంబాజీపేట పోలీస్ స్టేషన్‌లో పి.గన్నవరం సీడీపీఓ వై.విజయశ్రీ, తహసీల్దార్ టి.మంగతాయారు, ఉమ్మడి జిల్లాల చైల్డ్ కేర్ కోఆర్డినేటర్ బి.శ్రీనివాస్‌ల సమక్షంలో బిడ్డను తల్లికి అప్పగించారు. అధికారుల కథనం ప్రకారం.. పుల్లేటికుర్రు శివారు చీకురుమిల్లివారిపేటకు చెందిన బాలిక మార్చి 5న అమలాపురంలో ఓ ప్రైవేట్ ఆసుపత్రిలో మగబిడ్డకు జన్మనిచ్చింది. పోషించే స్థోమత లేకపోవడంతో ఆ బిడ్డను పి.గన్నవరానికి చెందిన ఓ కుటుంబానికి బాలిక, ఆమె తండ్రి ఇచ్చారని అధికారులు తెలిపారు. పుట్టిన బిడ్డ ఏమయ్యాడోనని స్పందనలో బంధువులు, గ్రామస్తులు ఫిర్యాదు చేయడంతో పాటు, జిల్లా చైల్డ్ కేర్ 1908కి ఫోన్‌కాల్ చేశారన్నారు. దీంతో జిల్లా స్త్రీ శిశు సంక్షేమ సాధికారిత అధికారి జీవీ సత్యవాణి, జిల్లా కలెక్టర్ హిమాన్షు శుక్లా ఆదేశాల మేరకు కొత్తపేట ఆర్డీఓ ఎం.ముక్కంటి పుల్లేటికుర్రులో రెండు రోజుల కిందట విచారణ చేపట్టారన్నారు. మాయమైన బిడ్డ పి.గన్నవరంలో ఓ దంపతుల వద్ద ఉన్నట్లు పోలీసుల ద్వారా సమాచారం అందడంతో ఆదివారం స్థానిక పోలీస్ స్టేషన్‌కు బిడ్డను తీసుకువచ్చారు. ఈ సందర్భంగా బాలికకు సీడీపీఓ విజయశ్రీ, తహసీల్దార్ మంగతాయారు అవగాహన కల్పించారు. ఎంత కష్టమైనా బిడ్డను తానే పోషించుకుంటానని బాలిక తెలపడంతో వారి కుటుంబ సభ్యులు, అధికారుల సమక్షంలో ప్రభుత్వ నిబంధనల మేరకు బిడ్డను అప్పగించామన్నారు. మహిళా పోలీస్ ఎ.రమాదేవి, వీఆర్వో తదితరులు అధికారుల వెంట ఉన్నారు.

సంస్కరణల గోదారి కందుకూరి

- సినీ మాటల రచయిత ఆకెళ్ల శివప్రసాద్
- కందుకూరి సాహితీ పురస్కారం ప్రదానం



శివప్రసాద్‌కు కందుకూరి సాహితీ పురస్కారం అందించి సత్కరిస్తున్న జక్కంపూడి విజయలక్ష్మి తదితరులు

సీటీఆర్ఐ (రాజమహేంద్రవరం): కందుకూరి వీరేశలింగం పంతులు అంటేనే సంస్కరణలకు గోదావరి లాంటి వారని ప్రముఖ సినీ మాటల రచయిత ఆకెళ్ల శివప్రసాద్ అన్నారు. ఆదివారం స్థానిక సంహిత కన్వెన్షన్ హాల్‌లో కళా గౌతమి, తెలుగు సారస్వత పరిషత్ ఆధ్వర్యంలో కందుకూరి జయంతి వేడుకల్లో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆకెళ్ల మాట్లాడుతూ సంస్కరణ కేవలం ఉపన్యాసాలు, కల్పనలతో చూపకుండా కార్యశీలతలో చూపిన వాస్తవికుడు కందుకూరి అని ప్రశంసించారు. ఒకే జన్మలో, మూడు జన్మల సార్థకమైన జీవితాన్ని నడిపిన యుగ పురుషుడిగా కందుకూరు వెలుగొందారని కొనియాడారు. ఇంత మంది ఆత్మీయుల మధ్య తాను కందుకూరి సాహితీ పురస్కారం అందుకోవడం ఎంతో ఆనందంగా ఉందన్నారు. ఈ కార్యక్రమానికి సంకల్పించిన సంజీవరావుకు కూడా తాను గోదారి ప్రాంతం వాడినని, వీటీ హైస్కూల్ విద్యార్థినన్న విషయం తెలియదని చమత్కరించారు. సభకు అధ్యక్షత వహించిన వ్యవస్థాపకుడు డాక్టర్ బీవీఎస్ మూర్తి మాట్లాడుతూ ఏటా ఈ పురస్కారాన్ని అందిస్తున్నామన్నారు. గౌరవ అతిథిగా విచ్చేసిన డీఎఫ్ ఫైర్ ఆఫీసర్ శ్రీహరి జగన్నాథ్ మాట్లాడుతూ రంగ మార్తాండ సినిమాలో భాష గురించి ఆయన తెలిపిన మాటలు చరిత్ర, సంస్కృతి వారసత్వాల త్రివేణి సంగమం లాంటివని, తెలుగు భాష గొప్పతనాన్ని ఆ పాత్ర ద్వారా చెప్పించడం అభినందనీయమని అన్నారు. ఆర్కే స్టడీ సెంటర్ అధినేత పి.రామకృష్ణ మాట్లాడుతూ మనుషుల సంబంధాల గురించి తెలిపే ఏ సినిమా అయినా ప్రజల ఆదరణ పొందుతుందన్నారు. ఇస్రో శాస్త్రవేత్త డాక్టర్ కె.సత్యనారాయణ మూర్తి మాట్లాడుతూ ప్రపంచమే పెద్ద నాటక రంగమని, ప్రతి పాత్ర సినీ రంగాన్ని తలపించేవిగా కనిపిస్తాయని తెలిపారు. ముఖ్య అతిథిగా విచ్చేసిన వైఎస్సార్ సీపీ పీఏసీ సభ్యురాలు జక్కంపూడి విజయలక్ష్మి మాట్లాడుతూ తెలుగు బ్రహ్మోత్సవాన్ని ఏటా నిర్వహించడానికి సన్నాహాలు చేస్తున్నామన్నారు. భాషా ఔన్నత్యాన్ని కాపాడుకోవడం ప్రతి ఒక్కరి బాధ్యతని తెలిపారు. అనంతరం కందుకూరి వీరేశలింగం జాతీయ సాహితీ పురస్కారాన్ని శివప్రసాద్‌కు అతిథులు అందించి ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో ఆచార్యులు డాక్టర్ తార్పట్ల సత్యనారాయణ, భాను స్కూల్స్ చైర్మన్ జక్కంపూడి సత్యనారాయణ, పిల్లి నిర్మల, నగర మహిళా కమిటీ కళ్యాణ్ రెడ్డి, లక్ష్మీ శ్రీనివాస్, లలిత అరవింద్, తాళ్లూరి జయప్రద, నూజిల్ల శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

క్రైం కార్నర్..

శుభకార్యానికి వెళ్తుండగా ప్రమాదం

- తండ్రి కళ్ల ముందే కుమార్తె మృతి
- తమ్మయ్యపేటలో దుర్ఘటన



చంద్రకళ మృతదేహంపై పడి రోదిస్తున్న తల్లి, బంధువులు



తొండంగి/కరప: అనుకోని ప్రమాదం ఆ కుటుంబంలో విషాదం నింపింది.. అల్లారు ముద్దుగా చూసుకుంటున్న కుమార్తెను అనంత లోకాలకు తీసుకుపోయింది.. తండ్రి కళ్ల ముందే కుమార్తె మృత్యువాత పడిన సంఘటన తొండంగి మండలం బెండపూడి పంచాయతీ తమ్మయ్యపేట గ్రామ శివారు జాతీయ రహదారిపై ఆదివారం జరిగింది. బైక్‌ను లారీ ఢీకొనడంతో బాలిక అక్కడికక్కడే మృతి చెందింది. తొండంగి ఎస్సై ఎస్.రవికుమార్ కథనం ప్రకారం.. కాకినాడ జిల్లా కరప మండలం గొడ్డటిపాలెం గ్రామానికి చెందిన వీరంరెడ్డి ముత్యాలరావు తన కుమార్తె చంద్రకళ (16), తన మరదలి కుమార్తె శిరీషలతో కలసి రౌతులపూడి మండలం లచ్చిరెడ్డిపాలెంలో బంధువుల ఇంట శుభకార్యానికి బైక్‌పై బయలు దేరారు. మిగతా బంధువులైన మహిళలు ఆటోలో వెనుక వస్తున్నారు. కత్తిపూడి దాటిన తర్వాత బెండపూడి గ్రామ పంచాయతీ తమ్మయ్యపేట శివారు రావికంపాడు విద్యుత్ సబ్‌స్టేషన్ జంక్షన్ వద్దకు వచ్చేసరికి వెనుక నుంచి లారీ వేగంగా వెళ్తూ వీరి బైక్‌ను ఢీకొంది. ఈ ప్రమాదంలో బైక్ అదుపు తప్పడంతో ముగ్గురూ కింద పడిపోయారు. చంద్రకళ రోడ్డుపై పడడంతో తలకు తీవ్ర గాయాలై అక్కడికక్కడే మృతి చెందింది. ముత్యాలరావుకు స్వల్ప గాయాలు కాగా శిరీష ప్రాణాపాయం నుంచి బయటపడింది. కళ్లెదుటే కుమార్తె మృత్యువాత పడటంతో తండ్రి ముత్యాలరావు కన్నీరు మున్నీరుగా విలపించిన తీరు స్థానికులను కంటతడి పెట్టించింది. వెనుకే ఆటోలో వస్తున్న తల్లి, బంధువులు ప్రమాద స్థలంలో విగతజీవిగా పడి ఉన్న చంద్రకళ మృతదేహాన్ని చూసి తల్లడిల్లిపోయారు. స్థానికుల సమాచారంతో ఎస్సై రవికుమార్ సంఘటనా స్థలాన్ని పరిశీలించారు. దీనిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని, మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం తుని ఏరియా ఆస్పత్రికి తరలించామని ఎస్సై వివరించారు.

గొడ్డటిపాలెంలో విషాదం

గొడ్డటిపాలెంకు చెందిన చంద్రకళ ప్రమాదంలో మరణించడంతో గ్రామంలో విషాదఛాయలు అలముకున్నాయి. ముత్యాలరావుకు భార్యతో పాటు కుమార్తె చంద్రకళ, ఒక కుమారుడు ఉన్నారు. చంద్రకళ కాకినాడలోని ఉమెన్స్ కళాశాలలో ద్వితీయ సంవత్సరం ఇంటర్ చదువుతోంది. కుమారుడు తాపీపని చేస్తున్నాడు. కొడుకు చదువుకోకపోయినా, కూతురినైనా చదివించుకుందామనుకుంటే తీరని అన్యాయం జరిగిందని తల్లి రోదించడం చూసి అందరి కళ్లు చెమర్చాయి. తమతో కలసి చదువుతున్న స్నేహితురాలు మృతి చెందడంతో సహచరులు తల్లడిల్లిపోయారు. మోటార్ సైకిల్‌పై ఎక్కించుకోకుండా ఉంటే ఇలా జరిగేది కాదని తండ్రి ముత్యాలరావు ఆవేదన వ్యక్తం చేశాడు.

చెరువులో పడి వ్యక్తి మృతి

పెరవలి: చెరువులో పడి ఓ వ్యక్తి మృతిచెందినట్లు పెరవలి ఎస్సై సూర్యభగవాన్ తెలిపారు. ఆయన కథనం ప్రకారం.. తాడేపల్లిగూడెం మండలం లింగారెడ్డిగూడేనికి చెందిన ఆరేపల్లి ఏసు (40) కూలి పనులు చేసుకుంటూ కుటుంబాన్ని పోషిస్తున్నాడు. ఈ క్రమంలో మండలంలో నడుపల్లి గ్రామానికి వారం రోజుల కిందట వచ్చాడు. గ్రామంలోని వల్లభస్వామి చెరువులో శనివారం మధ్యాహ్నం స్నానం చేస్తూ ప్రమాదవశాత్తూ మునిగిపోయాడు. ఆదివారం ఉదయం మృతదేహం పైకి తేలటంతో స్థానికుల సమాచారంతో పోలీసులు పరిశీలించారు. మృతదేహాన్ని తణుకు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించామని ఎస్సై వివరించారు. దీనిపై కేసు నమోదు చేశామన్నారు.

లారీ ఢీకొని వృద్ధుడి దుర్మరణం

కాజులూరు: కోలంక వద్ద లారీ ఢీకొనడంతో ఓ వృద్ధుడు మృతి చెందాడు. స్థానికులు, గొల్లపాలెం పోలీసుల కథనం ప్రకారం.. కుయ్యేరు శివారు రేగుబడవకు చెందిన కోట సుబ్బారావు (70) తాళ్లరేవు మండలం ఇంజరంలో కిరాణా సరుకులు కొనుగోలు చేశారు. తిరిగి తన సైకిల్‌పై ఇంటికి వెళ్తున్నారు. ఈ క్రమంలో కోలంక వద్దకు వచ్చేసరికి యానం నుంచి ద్రాక్షారామ వైపునకు ధాన్యం లోడుతో వెళ్తున్న లారీ ఢీకొంది. దీంతో అతను అక్కడికక్కడే మృతి చెందాడు. సుబ్బారావుకు భార్య, నలుగురు కుమారులు ఉన్నారు. గొల్లపాలెం ఎస్సై ఎస్.తులసీరామ్ మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం కాకినాడ ప్రభుత్వాసుపత్రికి తరలించి కేసు నమోదు చేశారు.

ఆర్టీసీ బస్సులో వ్యక్తి హఠాన్మరణం



పైల లోవరాజు (ఫైల్)

రౌతులపూడి: ఆర్టీసీ బస్సులో ఓ వ్యక్తి కుప్పకూలి మృతిచెందాడు. బంధువుల కథనం ప్రకారం.. బలరామపురానికి చెందిన పైల లోవరాజు ఆదివారం తన ఇద్దరు అక్కలతో కలసి కాకినాడ వెళ్లారు. అక్కడ తన బంధువును ఆసుపత్రిలో పలుకరించి తిరిగి ఆర్టీసీ బస్సులో స్వగ్రామానికి బయలు దేరారు. శృంగవరం వచ్చేసరికి దాహం అని మంచినీళ్లు తాగాడు. బలరామపురం వచ్చేసరికి ఇద్దరు అక్కలూ లేపినా స్పృహ కోల్పోయి ఉన్నాడు. అతనిని బంధువుల సహాయంతో బస్సు కిందకు దించగా అప్పటికే మృతి చెందినట్లు గుర్తించారు. మృతుడికి భార్య, కుమారుడు, కుమార్తె ఉన్నారు.

దూసుకొచ్చిన మృత్యువు

- వ్యాన్ కిందపడి డ్రైవర్ మృతి
- కాలువలోకి వెళ్లకుండా ఆపే యత్నంలో ఘటన



కాలువలోకి దూసుకుపోయిన వ్యాన్‌ను బయటకు లాగుతున్న స్థానికులు



ప్రమాదంలో మృతి చెందిన గంగరాజు

పిఠాపురం: జీవనాధారమై ఇన్నాళ్లు ఆసరాగా ఉన్న ఆ వాహనమే అతని ఆయువు తీసింది.. తన కళ్ల ముందే వ్యాన్ కాలువలోకి పడిపోతుంటే ఆపే ప్రయత్నంలో అతను ప్రాణాలు వదిలాడు. కూడు పెట్టిన వ్యానే ఆ డ్రైవర్ ఊపిరి తీయడంతో ఆ కుటుంబం కన్నీరు మున్నీరవుతోంది. పిఠాపురం మండలం రాపర్తిలో ఆదివారం ఈ హృదయవిదారక ఘటన చోటు చేసుకుంది. పిఠాపురం రూరల్ ఎస్సై అబ్దుల్ నబీ కథనం ప్రకారం.. రౌతులపూడి మండలం శింగవరం గ్రామానికి చెందిన బొట్టా గంగరాజు (45) మినీ వ్యాన్ నడుపుతూ జీవనం సాగిస్తున్నాడు. ఎప్పటిలాగే ఆదివారం ఉదయం తన స్వగ్రామం నుంచి 10 మంది వ్యవసాయ కూలీలను వరి కోతల కోసం పిఠాపురం మండలం రాపర్తి తీసుకెళ్లాడు. మధ్యాహ్నం కూలీలను తీసుకెళ్లడానికి సిద్ధమైన గంగరాజు అప్పటికే కొంత మంది కూలీలను ఎక్కించుకుని ఇంకా కొంత మంది రావాల్సి ఉండడంతో తన మినీ వ్యాన్‌ను రాపర్తి వద్ద కాలువ పక్కన నిలిపాడు. కూలీలు వచ్చి ఎక్కిన తరువాత బయలు దేరుదామని అనుకుంటుండగా వ్యాన్ హ్యాండ్ బ్రేక్ పనిచేయక పోవడంతో నెమ్మదిగా కదులుతూ కనిపించింది. దీంతో కంగారు పడిన గంగరాజు తన వ్యాన్ కాలువలో పడిపోతుందని భావించి దానిని ఆపేందుకు వ్యాన్ వెనుకకు వెళ్లి భుజం పెట్టి ఆపే ప్రయత్నం చేశాడు. అప్పటికే పూర్తిగా అదుపు తప్పిన వ్యాన్ ఒక్కసారిగా కాలువలోకి పడిపోయింది. దీంతో వెనుక ఉన్న డ్రైవర్ గంగరాజు వ్యాన్ కింద బురదలో చిక్కుకుపోయాడు. ఇదంతా దూరం నుంచి చూస్తున్న మిగతా కూలీలు గట్టిగా కేకలు వేయడంతో స్థానికులు పరుగున వచ్చి వ్యాన్‌ను బయటకు లాగే ప్రయత్నం చేయడంతో పాటు వ్యాన్‌లో ఉన్న కూలీలను రక్షించారు. బురదలో చిక్కుకుపోయిన గంగరాజును బయటకు తీయగా అప్పటికే అతను మృతి చెందాడు. సంఘటనా స్థలానికి చేరుకున్న పిఠాపురం సీఐ వైఆర్‌కే శ్రీనివాస్ స్థానికుల నుంచి వివరాలు అడిగి తెలుసుకున్నారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం పిఠాపురం ప్రభుత్వాసుపత్రికి తరలించారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. వ్యాన్‌లో ఉన్న కూలీలు స్వల్ప గాయాలతో బయటపడ్డారు. మృతుడికి భార్య, ఇద్దరు కుమారు, ఒక కుమార్తె ఉన్నారు. సంఘటనా స్థలం వద్ద మృతిని బంధువులు రోదిస్తున్న తీరు చూపరులకు కంటతడి పెట్టించింది.

సంస్కృతికి కళలు ఆయువుపట్టు



విశ్రాంత ఉపాధ్యాయుడు సుబ్బారావును సత్కరిస్తున్న కళాకారులు

నల్లజర్ల: భారతీయ సంస్కృతికి కళలు ఆయువుపట్టు లాంటివని రాష్ట్ర రంగస్థల కళాకారుల సంఘ అధ్యక్షుడు శలా కోటివీరయ్య అన్నారు. తెలుగు నాటకరంగ దినోత్సవాన్ని ఆదివారం నల్లజర్లలోని అల్లాడ రామయ్య కల్యాణ మండపంలో నిర్వహించారు. దీనికి రాష్ట్రం నలుమూలల నుంచి సుమారు 500 మంది రంగస్థల కళాకారులు హాజరయ్యారు. నల్లజర్ల మండల శాఖ అధ్యక్షుడు తలంశెట్టి మాధవరావు అధ్యక్షతన నిర్వహించిన ఈ కార్యక్రమంలో కోటివీరయ్య మాట్లాడుతూ సమాజంలోని సమస్యలను ప్రతిబింబిస్తూ జనంలో చైతన్యం కలిగించే ప్రచార సాధనం నాటకం ఒక్కటేనన్నారు. నేటితరం ఎదుర్కొంటున్న సమస్యలపై నాటకాలు రావాల్సి ఉందన్నారు. విశ్రాంత ఉపాధ్యాయుడు కాలి సుబ్బారావు ప్రదర్శించిన మయసభ ఏకపాత్రాభినయం అలరించగా ఆయన్ని సత్కరించారు. ఉభయగోదావరి జిల్లాలకు నూతన అధ్యక్షుడిగా తలంశెట్టి మాధవరావును, కార్యదర్శిగా ఉన్నమట్ల వెంకటేశ్వరావును ఎన్నుకున్నారు. రాష్ట్ర కార్యదర్శి దువ్వి రామారావు, కోశాధికారి డి.హేమసుందర్, అల్లాడ రామకృష్ణ, టీవీ నరసింహారావు, ప్రత్తిపాటి గంగారావు, కోటిపల్లి నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.